క్లుప్తంగా...

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

ఘట్‌కేసర్: చెట్ల కొమ్మలు కొట్టివేస్తున్నందున బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ సతీష్ కుమార్ తెలిపారు. బాలాజీ నగర్ ఫీడర్ పరిధిలోని గాంధీనగర్, ఈడబ్ల్యూఎస్ కాలనీ, కొండాపూర్, సన్‌షైన్ పార్క్‌తో పాటు సమీప కాలనీలకు గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తున్నట్లు చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

మేడ్చల్: మరమ్మతుల కారణంగా గురువారం గుండ్లపోచంపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని పలు కాలనీల్లో కరెంట్ సరఫరా ఉండదని ఏఈ శశిధర్‌రెడ్డి తెలిపారు. గుండ్లపోచంపల్లి పరిధిలోని ఏజీఎస్ వెంచర్, ఎస్ఎల్ఆర్ కాలనీ, లక్ష్మీనగర్ కాలనీ, నైబర్‌హుడ్, ట్రిడెంట్, ఊర్జిత 1, 2లలో ఉదయం 10గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు కరెంట్ సరఫరా ఉండదని ఆయన తెలిపారు.

మిషన్ వాత్సల్య లక్ష్మీ స్కీం కోసం దరఖాస్తు చేసుకోవాలి

మేడ్చల్: తల్లి, తండ్రి లేదా తల్లిదండ్రులిద్దరూ లేని పిల్లలను ఆదుకోవడానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మిషన్ వాత్సల్య లక్ష్మీ స్కీంలో లబ్ధి పొందేందుకు ఈ నెల 30లోపు దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం అధికార ప్రతినిధి గౌడవెల్లి సర్పంచ్ సురేందర్‌ముదిరాజ్ కోరారు. ఐదు సంవత్సరాలలోపు పిల్లలు ఆధార్‌కార్డులు లేని వారు బర్త్ సర్టిఫికెట్లు, రెండు ఫొటోలతో మేడ్చల్ మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

ఆన్‌లైన్ దరఖాస్తులను యాప్‌లో అప్‌లోడ్ చేయాలి

శామీర్‌పేట్: కొత్త ఓటర్ల నమోదు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారి జాబితాను వెంటనే పరిశీలించి వారి వివరాలను యాప్‌లో పొందుపర్చాలని మేడ్చల్ కమిషనర్ రాములు అన్నారు. మున్సిపల్ పరిధిలోని 40 బూత్‌లలోని అధికారులతో ఆయన బుధవారం మున్సిపల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటు హక్కు పొందడానికి ఆన్‌లైన్ ద్వారా అర్జీ పెట్టుకున్న దరఖాస్తులను ఆయా బూత్ ఇన్‌చార్జిలు విచారణ(తనిఖీ) చేసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. 40 బూత్‌లలో దాదాపు 300 పైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే పరిశీలించి యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. మున్సిపల్ అధికారులు రాంచందర్, బూత్ లెవెల్ అధికారులు పాల్గొన్నారు.

జాతీయ సాహిత్య సంబురాలకు కొండల్‌రావు



మేడ్చల్: పట్టణంలోని సెయింట్ క్లారెట్ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న గుండవరం కొండల్‌రావు జాతీయ సాహిత్య సంబురాలకు ఆహ్వానం అందుకున్నాడు. తెలుగు భాషాభివృద్ధి, సాహిత్య వికాసానికి తెలుగు వెలుగు సాహిత్య వేదిక, ఎస్‌వీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 30న నగరంలోని పటాన్ చెరువులో జాతీయ సాహిత్య సంబరాలు నిర్వహిస్తుండటంతో ఆ సంబరాలకు కొండల్‌రావు ఎంపికయ్యాడు.

రూ.6.50 లక్షలు పలికిన తైబజార్

పోచారం: మున్సిపల్ కార్యాలయంలో బుధవారం 2023–24 ఆర్థిక సంవత్సరానికి తైబజార్ వేలం పాట జరిగింది. పోటీలో పది మంది అభ్యర్థులు పాల్గొనగా అందులో అందరి కంటే ఎక్కువగా అన్నోజిగూడకు చెందిన కె.శ్రీనివాస్‌గౌడ్ రూ.6.50 లక్షలకు పాడి తైబజార్‌ను దక్కించుకున్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్



ఇఫ్తార్ విందులో చామకూర మహేందర్‌రెడ్డి

కీసర: ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీక అని బీఆర్ఎస్ రాష్ట్ర నేత చామకూర మహేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం రాత్రి నాగారంలో కోఆప్షన్ సభ్యుడు ఆదాం షఫీరాం జాన్ మాసాన్ని పురస్కరించుకొని ముస్లింలకు ఇచ్చిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి, వైస్‌చైర్మన్ మల్లేష్‌యాదవ్, నేతలు కాజాబాయ్, రాహుల్ రెడ్డి, బీఆర్ఎస్ అధ్యక్షుడు తేళ్ల శ్రీధర్, బీఆర్ఎస్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

ఘట్‌కేసర్: చెట్టుకు ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ అశోక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. తుర్కయంజాల్‌కు చెందిన లక్ష్మిని కొండాపూర్‌కు చెందిన ఎస్.ముఖేష్ కుమార్(23) జనవరిలో ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరు ఘట్‌కేసర్‌లోని గీతా మందిరం సమీపంలో నివసిస్తున్నారు. మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో చిన్న చెరువు వద్ద చెట్టుకు ఉరేసుకుని ముఖేష్ కుమార్ ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు దర్యాప్తులో ఉంది.

కంటికి వెలుగేది?

అద్దాలతోనే సరి.. ఆపరేషన్లు ఏవీ..? ● ఊసేలేదంటున్న బాధితులు

- జిల్లాలో 31,612 మందికి ఆపరేషన్లు అవసరం
- జూన్ 20 వరకు కొనసాగనున్న కార్యక్రమం
- ప్రభుత్వానికి నివేదిస్తున్నామంటున్న వైద్యారోగ్యశాఖ
- వృద్ధులకు తప్పని ఎదురుచూపులు



సాక్షి, మేడ్చల్ జిల్లా: కంటి సమస్యలతో ఇబ్బంది పడుతున్న వారిని ఆదుకొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'కంటి వెలుగు' కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపట్టింది. జనవరి 19న రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభమైంది. వచ్చే జూన్ 20 వరకు ఈ కార్యక్రమం కొనసాగనుంది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని జీహెచ్ఎంసీ మున్సిపల్ సర్కిళ్లతో సహా 13 పురపాలక సంఘాలు, 61 గ్రామ పంచాయతీల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి కంటి సమస్యలు ఉన్న వారికి పరీక్షలు నిర్వహిస్తున్నారు. అవసరమైన వారికి రీడింగ్ అద్దాలను శిబిరాల్లోనే అందజేస్తున్నారు. దూరం చూపు లోపాలున్న బాధితులకు ఆర్డర్ పెట్టి వచ్చిన తర్వాత అద్దాలను పంపిణీ చేస్తున్నట్లు వైద్యాధికారులు చెబుతున్నారు. కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభమై రెండు నెలలు అవుతున్నా.. కంటి శస్త్ర చికిత్సల ఊసేలేదని బాధితులు పేర్కొంటున్నా.. వైద్యాధికారులు మాత్రం శస్త్ర చికిత్సల కోసం ప్రత్యేకంగా గుర్తించిన ప్రభుత్వ కంటి ఆసుపత్రులకు నివేదిస్తున్నట్లు పేర్కొంటున్నారు.

మేడ్చల్ జిల్లాలో 4.73 లక్షల మందికి పరీక్షలు

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఇప్పటి వరకు 4,73,144 మందికి కంటి పరీక్షలు చేశారు. 1,04,396 మందికి కంటి అద్దాలు అందజేశారు. మరో 47,307 కంటి అద్దాలు అవసరం కాగా.. వాటి కోసం ఆర్డర్ ఇచ్చినట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. కంటి పరీక్షలు చేయించుకున్న వారిలో 31,612 మందికి శుక్లాలు తదితర శస్త్ర చికిత్సలు అవసరమని వైద్యులు గుర్తించారు. ఈ బాధితులు సొంతంగా ప్రైవేటుగా శస్త్రచికిత్సలు చేయించుకోవాలా..? లేక ప్రభుత్వమే చేయిస్తుందా? అన్న అంశంపై స్పష్టత లేదు. అంతేగాక ప్రిస్క్రిప్షన్ (దూరపు చూపు) అద్దాలు అవసరమైన వారికి వాటిని అందివ్వడంలో జాప్యం చోటుచేసుకుంటోందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

> **శస్త్ర చికిత్సల కోసం నివేదిస్తున్నాం..**
>
> కంటి వెలుగు కార్యక్రమంలో ఏర్పాటు చేసిన శిబిరాల్లో కంటి శస్త్రచికిత్సలు అవసరమైన వారిని ప్రత్యేకంగా గుర్తించి ప్రభుత్వ కంటి ఆసుపత్రులకు ముఖ్యంగా సరోజినీదేవి కంటి ఆస్పత్రికి పంపిస్తున్నాం. అలాగే.. వారి వివరాలు ప్రభుత్వానికి కూడా నివేదిస్తున్నాం. శస్త్రచికిత్సలు ప్రభుత్వమే చేయిస్తోంది. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటాం.
>
> – డా.పుట్ల శ్రీనివాస్, జిల్లా వైద్యఆరోగ్య శాఖ, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా

సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం



మాట్లాడుతున్న మంత్రి చామకూర మల్లారెడ్డి

మంత్రి చామకూర మల్లారెడ్డి

కీసర: అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో మన రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. బుధవారం చీర్యాల గ్రామంలోని ఎంఎల్ఎస్ కన్వెన్షన్‌లో జరిగిన కీసర మండల బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి మల్లారెడ్డి మాట్లాడారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం సాధించుకున్నప్పటి నుంచి అన్నిరంగాల్లో పురోగతి సాధించి ఆదర్శ రాష్ట్రంగా తెలంగాణ రూపుదిద్దుకుందన్నారు. కేవలం మతాన్ని అడ్డుపెట్టుకొని రాజకీయాలు చేయడమే బీజేపీ పనిగా పెట్టుకుందని విమర్శించారు. బీఆర్ఎస్‌కు ప్రజల్లో ఉన్న ఆదరణను చూసి ఓర్వలేక ఈడీ, ఐటీ దాడులు చేస్తూ బీఆర్ఎస్ నేతలను ఇబ్బంది పెట్టడమే లక్ష్యంగా కేంద్రం వ్యవహరిస్తోందని అన్నారు. బీజేపీ ప్రభుత్వానికి, మోదీకి దమ్ముంటే రాష్ట్రంలో అమలు అవుతున్న సంక్షేమ పథకాలను బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన వారికి అందించే విధంగా పార్టీ కార్యకర్తలు ముందుకు సాగాలన్నారు. త్వరలోనే నిరుపేదలకు డబుల్‌బెడ్‌రూం ఇళ్లు, స్థలం ఉన్నవారికి ఇల్లు కట్టుకునేందుకు రూ.3 లక్షలు ఇచ్చే కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. దళిత బంధు పథకాన్ని అర్హులైన వారికి అందించే విధంగా పనిచేయాలని సూచించారు. గడిచిన ఏళ్లలో చేసిన అభివృద్ధిని ప్రజలకు తెలియజేయాలన్నారు. అభివృద్ధి సంక్షేమంలో దూసుకుపోతున్న మేడ్చల్ నియోజకవర్గంలో మూడోసారి గులాబీ జెండా ఎగరడం ఖాయమన్నారు. సమావేశంలో జెడ్పీచైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి, మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర యువనాయకులు డాక్టర్ భద్రారెడ్డి, జెడ్పీవైస్ చైర్మన్ బెస్త వెంకటేష్, ఎంపీపీ మల్లారపు ఇందిరాలక్ష్మీనారాయణ, కీసర మండల అధ్యక్షుడు జలాల్‌పురం సుధాకర్ రెడ్డి, వైస్ఎంపీపీ జె.సత్తిరెడ్డి, ప్రధాన కార్యదర్శి సింగారం నారాయణ, ఆయా గ్రామాల సర్పంచులు ధర్మేందర్, మహేందర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, మాధురి, సత్తమ్మ, విమల, అండాలు, రాజు, పెంటయ్య ఆయా గ్రామాల ఎంపీటీసీ సభ్యులు కవిత, వెంకటేష్, నారాయణశర్మ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి నివేదికలు అందజేయాలి

సమావేశంలో జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్



సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల పురోగతిపై నియోజకవర్గాల వారీగా ప్రగతి నివేదికలు రూపొందించి సమర్పించాలని జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్, సీపీవో మోహన్‌రావుతో కలిసి సంబంధిత జిల్లా అధికారులతో ప్రగతి నివేదికల రూపకల్పనపై ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. 2014–15 నుంచి 2022–23 సంవత్సరం వరకు జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో చేపట్టిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలపై నివేదిక రూపొందించి, అప్పట్లో జరిగిన పనులు, ప్రస్తుతం జరుగుతున్న పనులకు సంబంధించిన పూర్తి సమాచారంతో శాఖల వారిగా ఫొటోలతో కూడిన నివేదికలను అందజేయాలని కలెక్టర్ సూచించారు. మేడ్చల్ నియోజకవర్గానికి సంబంధించి ఈ నెల 25 వరకు పూర్తిస్థాయిలో నివేదిక రూపొందించి సమర్పించాలని అమయ్ కుమార్ ఆదేశించారు. మిగతా నాలుగు నియోజకవర్గాలకు సంబంధించిన అభివృద్ధి, ప్రగతి నివేదికలను 30వ తేదీలోగా అందజేయాలన్నారు. నిర్ణీత గడువులోగా అన్ని ప్రగతి నివేదికలను సీపీవో కార్యాలయంలో అందించాలని కలెక్టర్ సూచించారు. జిల్లా అభివృద్ధి కోసం అధికారులు పనిచేయాలన్నారు. సమష్టి కృషితో జిల్లాను అన్ని రంగాల్లో ముందుండే విధంగా కృషి చేయాలని కలెక్టర్ ఆకాంక్షించారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, పోలీస్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

జాతరకు ముస్తాబైన గౌడవెల్లి మైసమ్మ



ముస్తాబైన మైసమ్మ ఆలయం

మేడ్చల్: మండలంలోని గౌడవెల్లి వాసులు ఘనంగా జరుపుకునే మైసమ్మ జాతరకు మైసమ్మ ఆలయం ముస్తాబైంది. ఈ నెల 23వ తేదీ నుంచి మైసమ్మ ఆలయంలో ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రామ సర్పంచ్ సురేందర్‌ముదిరాజ్ కోరారు. ఈ నెల 23న గణపతి పూజ, పుణ్యావాచనం, అమ్మవారి అభిషేకం, అలంకరణ, అష్టోత్తర శతనామార్చన, ఆరగింపు మంగళహారతి, బోనాల సమర్పణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. గ్రామస్తులు మైసమ్మ జాతరను సంతోషంగా జరుపుకోవాలని కోరారు.

గోధుమకుంటను సందర్శించిన ఇన్‌చార్జి ఎంపీఓ



గోధుమకుంటలో రికార్డులను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఎంపీఓ నందకిషోర్

కీసర: గోధుమకుంట గ్రామాన్ని బుధవారం ఇన్‌చార్జి ఎంపీఓ నందకిషోర్ సందర్శించారు. గ్రామంలోని వైకుంఠధామం, డంపింగ్‌యార్డు, నర్సరీని పరిశీలించిన తర్వాత గ్రామపంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. గ్రామంలో అక్రమ నిర్మాణాలు, అక్రమలేఅవుట్లను ఎట్టిపరిస్థితుల్లో కొనసాగనివ్వొద్దని గ్రామకార్యదర్శి సురేష్‌రెడ్డిని ఆదేశించారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న మంత్రి మల్లారెడ్డి

శామీర్‌పేట్: దేశంలో ఎక్కడా లేని సంక్షేమ పథకాలు తెలంగాణలో అమలు అవుతున్నాయని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. శామీర్‌పేట మండలంలోని కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు బుధవారం చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మంత్రి మల్లారెడ్డి పాల్గొని 61 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎల్లుబాయి, జెడ్పీటీసీ అనిత, డీసీఎంఎస్ వైస్‌చైర్మన్ మధుకర్‌రెడ్డి పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

మైనర్ బాలికపై లైంగికదాడికి పాల్పడిన నిందితుడికి జీవితఖైదు

కీసర: మైనర్ బాలికపై లైంగికదాడికి పాల్పడిన నిందితుడికి మల్కాజిగిరి కోర్టు జీవిత ఖైదు శిక్ష విధించింది. వివరాలు.. కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలోని అహ్మద్‌గూడ సమీపంలో 2021 మే 31న ఓ చిన్నారి ఇంటి ముందు ఆడుకుంటుండగా నిందితుడు అభిరామ్‌దాస్ అలియాష్ అభి(34) చిన్నారిపై లైంగికదాడికి పాల్పడి అర్ధరాత్రి ఇంటి సమీపంలో చిన్నారిని వదలి వెళ్లాడు. దీంతో చిన్నారి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. కేసును సవాలుగా తీసుకున్న పోలీసులు పక్కా ఆధారాలు సేకరించి నిందితుడిని అదుపులోకి తీసుకొని మల్కాజిగిరి కోర్టులో హాజరుపర్చగా రిమాండ్‌కు తరలించారు. కేసు విచారణలో భాగంగా బుధవారం మల్కాజిగిరి కోర్టు నిందితుడికి జీవితఖైదుతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ తీర్పువెల్లడించింది. ఈ సందర్భంగా రాచకొండ సీపీ చౌహాన్, అడిషనల్ సీపీ సత్యనారాయణ, డీసీపీ జానకి, ఏసీపీ వెంకట్‌రెడ్డి, కీసర పోలీసులను అభినందించి రివార్డు అందజేశారు.

బీజేపీలో పలువురి చేరిక



బీజేపీలో చేరిన వారితో ఈటల రాజేందర్, ప్రవీణ్‌రావు, మోహన్‌రెడ్డి

ఘట్‌కేసర్: చౌదరిగూడకు చెందిన పలువురు యూత్ నాయకులు బీజేపీ మండల అధ్యక్షుడు చలువాదీ ప్రవీణ్‌రావు ఆధ్వర్యంలో బుధవారం బీజేపీలో చేరారు. ఈటల రాజేందర్ నివాసంలో బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు కొంపెల్లి మోహన్‌రెడ్డి, ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి సమక్షంలో హుజూరాబాద్ ఎమ్మెల్యే, చేరికల కమిటీ అధ్యక్షుడు ఈటల రాజేందర్ వారికి పార్టీ కండువాలు కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి శ్రీశైలం, సురేశ్, నాయకులు లక్ష్మీరెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, బాలుయాదవ్, రమేశ్‌నాయుడు, సురేందర్ రెడ్డి, ప్రభంజన్‌గౌడ్, వేమన, ఉదయ్, పవన్‌కుమార్, సాయిముదిరాజ్, బాలకృష్ణ, అర్జున్, శివముదిరాజ్, వినోద్‌కుమార్, నవీన్, తరుణ్, సాయి, సుమంత్, తేజ, బన్నీ, ధర్మతేజ, దినేశ్, ప్రశాంత్‌రెడ్డి, భరత్‌సిద్ధు, సునంద్, నరేశ్ పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

పోచారం: అన్నోజిగూడ ఫ్లైఓవర్ వద్ద చైర్మన్ కొండల్‌రెడ్డి ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. బాటసారుల దాహార్తిని తీర్చేందుకు ప్రతి సంవత్సరం నిర్వహించినట్లే ఈ వేసవి లోనూ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామని చైర్మన్ తెలిపారు.

మెకానిక్ కెమికల్ సాంకేతిక అన్‌స్కిల్లింగ్‌పై అవగాహన



ఏయూలో మెకానికల్, కెమికల్ అన్‌స్కిల్లింగ్‌పై అవగాహన కల్పిస్తున్న భానుతేజ

ఘట్‌కేసర్: వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో మెకానికల్, కెమికల్ సాంకేతిక విభాగాలు అన్‌స్కిల్లింగ్‌పై బుధవారం అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా ఆస్మాసిస్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ అసిస్టెంట్ హెచ్ఆర్ భానుతేజ హాజరై మెకానిక్, కెమికల్ సమస్యల పరిష్కారాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక విద్య చదువుకున్నా జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవడానికి అన్‌స్కిల్లింగ్‌పై అవగాహన పంచుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మధు, ప్రతిభ, అర్జున్‌రెడ్డి, సాయిచంద్ర, శ్రవణ్‌కుమార్, మెకానికల్, కెమికల్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీఎస్ఓ ఒలింపియాడ్‌లో శ్రీచైతన్య విజయభేరి



శివసాయికుమార్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మేడ్చల్: దేశవ్యాప్తంగా 3వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించే ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలంపియాడ్(ఐఎన్‌టీఎస్ఓ) పరీక్షల్లో మేడ్చల్ పరిధి గుండ్లపోచంపల్లిలోని శ్రీచైతన్య విద్యార్థులు విజయభేరి మోగించారు. ఐఎన్‌టీఎస్ఓ లెవెల్–2కు జరిగిన పరీక్షల్లో 321 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఇందులో కె.శివ సాయికుమార్ ట్యాబ్, మెడల్ సాధించగా మరో నలుగురు 2, 3, 4, 5వ ప్రైజ్‌లను సాధించారు. 20 మంది కన్సోలేషన్ ప్రైజ్‌లు, 90 మంది మెడల్స్, 205 మంది విద్యార్థులు మెరిట్ సర్టిఫికెట్లను సాధించారని ప్రిన్సిపల్ జితేందర్ తెలిపారు. శ్రీచైతన్య అకాడమిక్ డైరెక్టర్ సీమా, కొంపల్లి జోన్ ఏజీఎం జీవీ రమణరావు, హాస్టల్ ప్రిన్సిపల్ విక్రం విద్యార్థులను అభినందించారు.

అన్ని వర్గాల అభివృద్ధికి కృషి

● జవహర్‌నగర్ మేయర్ కావ్య

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం మేయర్ మేకల కావ్య అధ్యక్షతన ముస్లింలకు రంజాన్ కానుకలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని వర్గాల అభివృద్ధికి ప్రభుత్వంలో ఎంతో కృషి చేస్తోందన్నారు. గత ప్రభుత్వాలకు భిన్నంగా కుల మతాలకు అతీతంగా అన్ని వర్గాలకు ప్రభుత్వం సమప్రాధాన్యం ఇస్తోందన్నారు. మైనార్టీల సంక్షేమానికి బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించి వారి అభివృద్ధికి పాటుపడుతోందన్నారు.డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, కార్పొరేటర్లు, కో–ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ ఆర్వో ప్రభాకర్‌యాదవ్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.




రంజాన్ కానుకలను అందజేస్తున్న మేయర్ కావ్య

ఉద్యాన అధికారుల పర్యటన

శామీర్‌పేట్: ఉమ్మడి శామీర్‌పేట మండలంలో బుధవారం కేంద్ర ఉద్యానశాఖ అధికారుల పర్యటించారు. ఇండో ఇజ్రాయిల్ విలేజ్ ఎక్సలెన్స్, సమీకృత ఉద్యాన అభివృద్ధి పథకం(ఎంఐడీఎహ్ – మిషన్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఆఫ్ హార్టికల్చర్) కేంద్ర అధికారులు ఏ.కే.మీనా, చిరాగ్ భాటియాలు మూడుచింతలపల్లి మండలంలోని ఆద్రాస్ పల్లి, శామీర్‌పేట మండలంలోని బొమ్మరాశిపేట గ్రామాల్లో పర్యటించారు. ఆద్రాస్‌పల్లిలో ఎంఐడీహెచ్ ద్వారా అమలవుతున్న పథకాల గురించి తెలుసుకున్నారు. ఉద్యానశాఖ ప్రధాన కార్యాలయం అధికారి ఏడీహెచ్ వేణుగోపాల్, మేడ్చల్ జిల్లా ఉద్యాన అధికారి నీరజగాంధీ, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏడీహెచ్ అహ్మద్, అధికారులు మహేష్, రేణుక రైతులు పాల్గొన్నారు.

మూడేళ్ల అభివృద్ధి ఇదే..



ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలో మూడేళ్ల కాలంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి మున్సిపల్ ఆధ్వర్యంలో రూపొందించిన బ్రోచర్‌ను బుధవారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, కమిషనర్ వాణీరెడ్డి, వైస్‌చైర్మన్ బండారి మల్లేష్ యాదవ్, మున్సిపల్ పాలకవర్గం సభ్యులతో కలిసి ప్రారంభించారు. బ్రోచర్‌లో రోడ్లు, విద్యుత్‌దీపాలు, తాగునీటి సౌకర్యం కోసం చేపట్టిన పనులు, హరితహారం, పార్కుల అభివృద్ధి తదితర అభివృద్ధి పనులకు కేటాయించిన నిధుల వివరాలను పొందుపర్చినట్లు చెప్పారు.

రంజాన్‌ను ఘనంగా నిర్వహించుకోవాలి



అత్వెల్లిలో రంజాన్ కిట్లు అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



రంజాన్ కిట్ల పంపిణీ చేస్తున్న నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి తదితరులు



రంజాన్ కిట్లు అందజేస్తున్న అవుషాపూర్ సర్పంచ్ కావేరి తదితరులు

మేడ్చల్: మున్సిపాలిటీ పరిధిలోని అత్వెల్లిలో, రావల్ కోల్ గ్రామంలో ముస్లింలకు బీఆర్ఎస్ నాయకులు రంజాన్ కానుకలను పంపిణీ చేశారు. రంజాన్ పండగను ఘనంగా జరుపుకోవాలని నాయకులు కోరారు. కార్యక్రమాల్లో మండల పరిషత్ వైస్ ఎంపీపీ గోపని వెంకటేషం, బీఆర్ఎస్ బీసీ సెల్ మున్సిపాలిటీ అధ్యక్షుడు రవికుమార్, నాయకులు ఈశ్వరయ్య, రవికుమార్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

అన్ని పండగలకు గౌరవం

కీసర: బీఆర్ఎస్ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ అన్నిమతాలు, పండగలను గౌరవిస్తున్నారని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ముస్లింలకు రంజాన్ కిట్లను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమిషనర్ వాణీరెడ్డి, వైస్‌చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, కౌన్సిలర్లు గూడురు సబితాఆంజనేయులు, బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, మోకు రేణుకజగన్ మోహన్‌రెడ్డి, హరిబాబు, వెంకట్‌రెడ్డి, దివ్యదయాకర్ రావు, అన్నంరాజు సుమిత్రిసురేష్, నాగేష్, కౌకుట్ల మమతకృష్ణారెడ్డి, కొముర్లెల్లి అనితాసుధాకర్‌రెడ్డి, ప్రియాంక, అన్నంరాజులావణ్య శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అవుషాపూర్‌లో..

ఘట్‌కేసర్: అవుషాపూర్‌లో పంచాయతీ కార్యాలయంలో బుధవారం రంజాన్ కానుకలను పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా సర్పంచ్ కావేరిమశ్చేందర్‌రెడ్డి, ఉప సర్పంచ్ ఐలయ్యయాదవ్ హాజరై ముస్లిం మహిళలకు రంజాన్ కిట్లను అందజేశారు. శ్రీనివాస్‌గౌడ్, వీరేశం, కుశలవరెడ్డి, వెంకట్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, కార్యదర్శి సునీత పాల్గొన్నారు.